క్లుప్తంగా

నేడు ఆత్మీయ సమ్మేళనం

కెరమెరి: మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 12 గంటలకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఎంపీపీ పెందోర్ మోతీరాం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణరావు, ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు, కార్యకర్తలు, నాయకులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

సమావేశానికి బయలుదేరిన సీపీఎం నాయకులు



తరలివెళ్తున్న సీపీఎం నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: హైదరాబాద్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఎం), సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యేందుకు కుమురం భీం జిల్లాలోని సీపీఎం నాయకులు తరలివెళ్లారు. ఉదయం భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలులో వెళ్లిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాజన్నతో పాటు ఆనంద్, శ్రీనివాస్, అంబాల ఓదెలు తదితరులు ఉన్నారు. వారు మాట్లాడుతూ వామపక్షాల ఐక్యతే దేశానికి రక్ష అని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయన్నారు.

గ్రామాల్లో భీమ్ దీక్ష ర్యాలీ



అంబేద్కర్ విగ్రహానికి మొక్కుతున్న దీక్షాపరులు

కౌటాల: మండలంలోని బోదంపల్లి, కౌటాల, బాలేపల్లి, గుండాయిపేట్, తుమ్మిడిహెట్టి గ్రామాల్లో ఆదివారం భీమ్ దీక్షాపరులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా గ్రామాల్లో మూడు రోజుల పాటు భీమ్ దీక్షాపరులు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బౌద్ధ సమాజ్ సంఘం సిర్పూర్ తాలుకా అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. మహార్ కులస్తులు దీక్షను స్వీకరించాలని తెలిపారు. కార్యక్రమంలో మహార్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న దేవార వినోద్

రెబ్బెన: వేసవిని దృష్టిలో పెట్టుకుని దేవార వినోద్ యువసేన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఆదివారం ఇందిరానగర్‌తో పాటు రెబ్బెన మండలకేంద్రంలో అంబలి పంపిణీ చేపట్టారు. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా అంబలిపై ఆసక్తి చూపడం సంతోషంగా ఉందని ట్రస్ట్ వ్యవస్థాపకులు దేవార వినోద్ అన్నారు. వర్షాకాలం ప్రారంభమయ్యే వరకు పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం	: దసరా

కాగజ్‌నగర్

వెంకటరమణ	: బలగం

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజి	40

-ఆసిఫాబాద్‌అర్బన్

షెడ్డు లేక విద్యార్థినుల అవస్థలు



భోజనం కోసం ఎండలో నిల్చున్న విద్యార్థినులు

- ఎండలోనే భోజనం కోసం ఎదురుచూపులు
- కూర్చునేందుకు సరిపోని డార్మెంటరీ
- ఏళ్లుగా కష్టాలు పడుతున్న వైనం

కెరమెరి: ఆశ్రమ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. మండలంలోని మోడి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో భోజనం చేసేందుకు స్థలం సరిపోకపోవడంతో విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. తరగతి గదుల్లో, వరండాల్లో కూర్చొని భోజనం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

540 మంది విద్యార్థినులు..

మండలంలోని మోడి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 540 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికి కలిపి మొత్తం ఎనిమిది తరగతి గదులున్నాయి. అయితే మధ్యాహ్నం అయిందంటే చాలు విద్యార్థినులు చుక్కలు చూస్తున్నారు. ఓవైపు ఆకలితో కడుపు మండుతుంటే మరోవైపు ఎండల తాకిడి తట్టుకోలేక సతమతమవుతున్నారు. పాఠశాలలో డార్మెంటరీ చిన్నదిగా ఉండడంతో ఆరుబయటనే పిల్లలకు భోజనం వడ్డిస్తున్నారు. దీంతో ఎర్రటెండలో తమ వంతు వచ్చే వరకు విద్యార్థినులు క్యూలైన్‌లో నిల్చోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



గదిలో భోజనం చేస్తున్న బాలికలు

షెడ్డు లేక తిప్పలు

వంటలు తయారు చేసుకునేందుకు రేకులతో నిర్మించిన వంటగది ఉంది. కాని దాని ముందు ఎలాంటి షెడ్డు లేకపోవడంతో విద్యార్థుల అవస్థలు అన్నీఇన్నీ కావు. మండుటెండలో గంటల తరబడి భోజనం తీసుకునేందుకు ప్లేట్లు చేత పట్టుకుని ఉండాల్సిన పరిస్థితి వారిది. ఎన్నో ఏళ్ల నుంచి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా షెడ్డు నిర్మించాలన్నా చిత్తశుద్ధి అధికారుల్లో కొరవడింది.

సరిపోని డార్మెంటరీ

పాఠశాలలోని డార్మెంటరీ వంద మంది విద్యార్థులకు కూడా సరిపోవడం లేదు. దీంతో విద్యార్థులు తాము పడుకునే గదుల్లో, వరండాల్లో కూర్చొని భోజనం చేస్తున్నారు. చాలా కాలంగా అధికారులకు సౌకర్యాలు కల్పించాలని విన్నవించినా ఎలాంటి స్పందన లేదని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. ఈమేరకు ఐటీడీఏ ఏఈ నజిమోద్దీన్‌ను వివరణ కోరగా నిధులు లేవని, మంజూరు కాగానే షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.

గంటల తరబడి లైన్‌లో..



భోజనం కోసం గంటల తరబడి ఎండలోనే లైన్‌లో నిలబడుతున్నాం. ఓవైపు ఆకలితో కడుపు కాలుతుంటే మరోవైపు ఎండలకు మాడిపోతున్నాం. అధికారులు తక్షణమే స్పందించి షెడ్డు నిర్మించాలి.

- బి.సోనికా, 10వ తరగతి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. జిల్లాస్థాయి అధికారులు పాఠశాలను తనిఖీ చేశారు. త్వరలో షెడ్డు నిర్మిస్తామన్నారు. కాని ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు.

- ప్రేంసింగ్, హెచ్‌ఎం

అభివృద్ధి వైపు అడుగులు



పెంచికల్‌పేట్‌లో నిర్మాణం పూర్తయిన సీసీరోడ్డు

- గ్రామాల్లో పూర్తయిన సీసీరోడ్లు
- మండలానికి రూ. 2కోట్ల 20లక్షలు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పెంచికల్‌పేట్: గ్రామపంచాయతీల్లో అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారుల నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా నిధులు విడుదల చేశారు. దీంతో ఆయా పంచాయతీల్లో సర్పంచులు మట్టిరోడ్లపై సీసీ వేయడంతో గ్రామాల్లో నెలకొన్న బురద సమస్య తీరింది. ఆయా పంచాయతీల్లో సీసీరోడ్ల నిర్మాణం శరవేగంగా పూర్తి కావడంతో మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు విడుదల..

పెంచికల్‌పేట్ మండలంలోని కొండపల్లికి రూ.30లక్షలు, లోడుపల్లికి రూ.30లక్షలు, ఎల్లూర్‌కి రూ.72లక్షలు, పెంచికల్‌పేట్‌కి రూ.20లక్షలు, అగర్‌గూడకి రూ.10లక్షలు, కమ్మర్‌గాంకి రూ.10లక్షలు, మురళీగూడకి రూ.15లక్షలు, బొంబాయిగూడకి రూ.5లక్షలు, చేద్వాయికి రూ.30లక్షల మంజూరయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు పనులు పూర్తి చేశారు.

బురద సమస్యకు పరిష్కారం..

పంచాయతీల్లో గత ఏడాది కాలంలో నిధుల కొరత ఉండటంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టడం సర్పంచ్‌లకు సవాలుగా మారింది. ఉపాధిహామీ పథకంలో అంతర్గత రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో వెంటనే పనులను ప్రారంభించారు. దీంతో గ్రామాల్లో వర్షాకాలంలో నెలకొనే బురద సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.

రోడ్డు నిర్మాణం పూర్తి



మా గ్రామంలో గత కొన్నేళ్లుగా బురద రోడ్లతో అనేక ఇబ్బందులు పడ్డాం. ఉపాధిహామీ పథకంలో భాగంగా నిధులు మంజూరు కావడంతో గ్రామాల్లో సీసీరోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. దీంతో ఏళ్లుగా ఉన్న బురద సమస్య తీరింది.

- కాశిపాక శేఖర్, పెంచికల్‌పేట్

ఆలె నరేంద్రకు ఘన నివాళి

ఆసిఫాబాద్‌అర్బన్: మాజీ కేంద్రమంత్రి ఆలె నరేంద్ర 9వ వర్ధంతి పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలో పద్మశాలి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నూరి అశోక్ అధ్యక్షతన ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ శిశుమందిర్ పాఠశాలల ప్రగతి కోసం లక్షలాది రూపాయలను కేటాయించారన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో నరేంద్ర పాత్రను ఎవరూ మర్చిపోలేరన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జంజిరాల శ్రీనివాస్, నాయకులు దాసరి రాజు, ధర్మయ్య, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పద్మశాలి సేవా సంఘం నాయకులు

శ్రీకృష్ణుడి ఆలయంలో పూజలు



ఆలయం వద్ద బోనాలతో మహిళలు

కౌటాల: మండలంలోని తలోడి గ్రామ పంచాయతీ పరిధి ధనుర్‌హెట్టి గ్రామంలోని శ్రీకృష్ణుడి ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. అగ్నిగుండా ప్రవేశాలు, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో మూడు రోజుల పాటు శ్రీకృష్ణ జెండాలు ఊరేగిస్తునట్లు తెలి పారు. ఆలయ పూజారి భీమయ్య, కమిటీ సభ్యులు మహేశ్, శంకర్, స్వామి, సుమన్, పాల్గొన్నారు.

త్యాగాలు వృథా కానివ్వం

ఆదిలాబాద్‌రూరల్: రాంజీగోండ్ త్యాగాన్ని వృథా కానివ్వమని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. ఆదివారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలోని కుమరం భీంగూడలో మర్సుకోల రాంజీగోండ్ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా రాంజీగోండ్ చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకొని రాంజీగోండ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్, వెట్టి మనోజ్, ఐటీడీఏ డైరెక్టర్ కుర్సేంగే తానాజీ, ఆదిలాబాద్ రూరల్ వైస్ ఎంపీపీ జంగు, గోడం రేణుక, పెందూర్ పుష్పరాణి, ఉయిక ఇందిరా, మెస్రం గంగాదేవి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

జైనథ్: జాతీయ రహదారిపై తరోడ గ్రామం సమీపంలోని వంతెన కుంగిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. ఆదివారం ఆమె రవాణా, జాతీయ రహదారుల కేంద్ర మంత్రిత్వ శాఖ రీజినల్ ఆఫీసర్ కుశ్వాతో ఫోన్‌లో మాట్లాడారు. ఇక్కడ కొత్త వంతెన నిర్మించడానికి ఇంకా టెండర్ ప్రక్రియ ఆలస్యం అవుతుందన్నారు. ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకొని టెండర్లు లేకుండా పనులు చేపట్టాలన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

ఎల్లారం పోచమ్మకు మొక్కులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు వివిధ వాహనాల్లో వచ్చి ముందుగా స్థానిక వాగుల్లోని గుండాల్లో పుణ్యస్నానం ఆచరించి, నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించారు. కోళ్లు, మేకలు బలిచ్చి ఇంటిల్లిపాదిని సల్లంగా చూడాలి అంటూ వేడుకున్నారు. అనంతరం చెట్లు కింద వంటావార్పు చేసుకొని విందుభోజనాలు ఆరగించారు.

యాపలగూడలో క్రికెట్ పోటీలు

కౌటాల: మండలంలోని యాపలగూడ గ్రామంలో ఈనెల 14 నుంచి అంబేద్కర్ జయంతి సందర్భంగా గ్రామ పంచాయతీ స్థాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రాజ్‌కుమార్, రాకేశ్, సతీష్, ప్రశాంత్ ఆదివారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ జట్టుకు రూ.10 వేలు అందిస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 6302470370, 9573691478 నంబర్లలో నిర్వాహకులను సంప్రదించాలని కోరారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కాగజ్‌నగర్‌రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో గౌరీశంకర్ తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించే సమావేశానికి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

చక్కర్లు కొట్టిన చాపర్



సాండ్‌గాం గ్రామం మీదుగా తిరుగుతున్న చాపర్

కౌటాల: మండలంలోని పార్డీ, సాండ్‌గాం, వీరవెల్లి గ్రామాల మీదుగా ఆదివారం చాపర్ విమానం పలుమార్లు చక్కర్లు కొట్టింది. తక్కువ ఎత్తులో విమానం ఎగరడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. గత మూడు రోజుల నుంచి మండలంలోని ఆయా గ్రామాల మీదుగా మహారాష్ట్రకు చెందిన జెట్ విమానం తిరుగుతోంది. పార్డీ, సాండ్‌గాం, వీరవెల్లి గ్రామాల మీదుగా మహారాష్ట్రకు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మించనున్న నేపథ్యంలో సర్వే చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

ఘనంగా పోచమ్మ తల్లికి బోనాలు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బుధాకుర్దు గ్రామంలో ఆదివారం పోచమ్మబోనాలు అంగరంగవైభవంగా జరిగాయి. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి బోనాన్ని పోచమ్మదేవతను సమర్పించారు. మహిళలు భక్తి ప్రపత్తులతో డప్పుచప్పుళ్ల మధ్య బోనాల కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పురవీధులన్నీ ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. గ్రామదేవత పోచమ్మతల్లికి మహిళలు నైవేద్యం సమర్పించి సల్లంగా చూడాలని వేడుకున్నారు. కోళ్లు, మేకలను బలిచ్చారు. కలిసికట్టుగా బోనాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

జైనూర్‌లో రాంజీ గోండ్ వర్ధంతి

కెరమెరి(జైనూర్): జైనూర్ మండలంలోని మార్లావాయి గ్రామ పంచాయతీలో ఆదివారం ఘనంగా రాంజీగోండ్ 163వ వర్ధంతిని జరుపుకున్నారు. సర్పంచ్ కనక ప్రతిభ రాంజీగోండ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాంజీగోండ్ నాయకత్వంలో ఆదివాసీలు ఆయుధమెత్తి బ్రిటీష్, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించారన్నారు. కార్యక్రమంలో నాయకులు సీతారాం, చందు, తెలంగారావు, జ్యోతిరాం, లచ్చు తదితరులు ఉన్నారు.



రాంజీగోండు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రతిభ

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

కౌటాల: మండలంలోని ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ఆదివారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. ఈస్టర్ వేడుకల కోసం మండల కేంద్రంతోపాటు మండలంలోని విజయనగరం, యాపలగూడ, శివలింగపూర్, సదాశివపేట గ్రామాలలో గల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కౌటాల చర్చిలో పాస్టర్ శాంతికుమార్, యాపలగూడ చర్చిలో ఫాదర్ సతీష్, కౌటాల చర్చిలో ఫాదర్ టామ్, సదాశివపేట చర్చిలో పాస్టర్ శ్రీనివాస్, శివలింగపూర్ చర్చిలో సువార్త రాజన్నలు క్రైస్తవులకు ఈస్టర్ సందేశాన్ని అందించారు.

యేసు క్రీస్తు చూపిన మార్గంలో నడవాలి

మండలంలోని విజయనగరం గ్రామంలోని చర్చిలో ఈస్టర్ వేడుకలను పురస్కరించుకొని ఫాదర్ సీజో క్రైస్తవులకు సందేశం బోధించారు. యేసుక్రీస్తు చూపిన మార్గంలో క్రైస్తవులందరు నడవాలన్నారు.



శివలింగపూర్‌లో వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

అలంకారప్రాయంగా నిర్మాణం



కెరమెరి: మండలంలోని నాగల్‌గొందిలో రూ.10 లక్షలు వెచ్చించి ఆరేళ్లక్రితం నిర్మించిన కమ్యూనిటీ భవనం అలంకారప్రాయంగా నిలిచింది. గిరిజన ఆదివాసీలు ప్రత్యేక సమావేశాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం నిర్మించినా ఒక్కసారి కూడా సమావేశం జరగలేదని స్థానికులు పేర్కొంటున్నారు.